క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై టీడీపీ గూండాల దాడి

కర్నూలు (టౌన్‌): కర్నూలు నగరంలో టీడీపీ వర్గీయులు దాడులకు తెగబడుతున్నారు. గురువారం రాత్రి పాతబస్తీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడి చేసి సామగ్రి ధ్వంసం చేశారు. వివరాలు.. స్థానిక 10వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌ షేక్‌ యూనుస్‌ బాషా కార్యాలయం ఉస్మానియా కళాశాల వద్ద ఉంది. ఇదే ఏరియాకు చెందిన రౌడీషీటర్‌, టీడీపీ కార్యకర్త మహబూబ్‌ ఖాన్‌ తన అనుచరులతో కలిసి కార్యాలయంపై దాడిచేసి కంప్యూటర్‌, ఎలక్ట్రానిక్‌ పరికరాలు, కార్యాలయ అద్దాలు ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేశారు. బాధిత కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. తన వార్డులో ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ గూండాలు దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నాటక ప్రదర్శనకు ఆదరణ



అంబేడ్కర్‌ పాత్రదారుడిని సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు (అర్బన్‌): ది బుద్ధిస్ట్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 16న స్థానిక లలిత కళాసమితిలో నిర్వహించిన 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకానికి విశేష స్పందన లభించిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు చెప్పారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. ఈ నాటకంలో డాక్టర్‌ బాబాసాహెబ్‌ అంబేడ్కర్‌ బుద్ధున్ని, బౌద్ధ ధర్మాన్ని ఎందుకు ఉన్నతంగా భావించాడు, లక్షల మంది ప్రజలను బౌద్ధ ధర్మం వైపు నడిపేందుకు గల కారణం ఈ నాటకం ద్వారా తేటతెల్లమైందన్నారు. ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు ఈ నాటకాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి ప్రదర్శన కర్నూలులోనే జరిగిందని చెప్పారు. ఈ నాటకం కర్నూలులో విజయవంతమయ్యేందుకు అనేకమంది సహకారం అందించారని, వారికి ధన్యవాదాలు తెలిపారు.

తుంగభద్రలో తగ్గిన నీటి ప్రవాహం

కర్నూలు సిటీ: వర్షాభావ పరిస్థితులతో తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం తగ్గింది. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో తుంగభద్ర డ్యాంలోకి ప్రస్తుతం 38,779 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఇందులో 33,196 క్యూసెక్కులు నదిలోకి గేట్ల ద్వారా విడుదల చేస్తున్నారు. మిగిలిన నీరు సాగునీటి కాలువలకు వదులుతున్నారు. నదిలో నీటి ప్రవాహం ఉన్న సమయంలో ఎత్తిపోతల పథకాలకు, పులికనుమ రిజర్వాయర్‌కు, గురురాఘవేంద్ర స్కీమ్‌లకు పంపలేదు. ప్రస్తుతం సుంకేసుల ఐదు క్రస్టు గేట్లతో దిగువకు 21,555 క్యూసెక్కులు వదులుతున్నారు. సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాలువకు 2,195, కర్నూలు నగరవాసుల తాగునీటి అవసరాలకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కోడుమూరు రూరల్‌: విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్‌ విమర్శించారు. గురువారం గూడూరులో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల కరపత్రాలను ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయి ఉదయ్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించేదిగా ఉందని ఆరోపించారు. గూడూరులోని పాఠశాలల్లో, హాస్టళ్లలో మౌలిక వసతులు, సదుపాయాలు లేక విద్యార్థినీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, గూడూరు మండల విద్యార్థుల ఇబ్బందులను తీర్చాలని ఆయన డిమాండ్‌ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు ఖాజావలి, స్థానిక నాయకులు వేణు, ఇమ్రాన్‌ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఆదోని అర్బన్‌: హొళగుంద మండలం సమ్మతగేరి గ్రామానికి చెందిన ఆంజనేయులు(79) అప్పుల బాధ, అనారోగ్యం కారణంగా మనస్థాపానికి గురై గురువారం పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఔట్‌పోస్టు కానిస్టేబుల్‌ తెలిపిన మేరకు వివరాలు.. సమ్మతగేరి గ్రామానికి చెందిన ఆంజనేయులుకు నాలుగు ఎకరాల భూమి ఉంది. పెట్టుబడులకు చేసిన అప్పులు ఎక్కువ కావడంతో పాటు అనారోగ్యంగా ఉండడంతో మనస్థాపానికి గురై గురువారం పట్టణశివారులోని ఇందిరమ్మ కాలనీ వద్ద పురుగులమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ జారీ

- కమిటీకి ఇవే చివరి ఎన్నికలు
- ఈ నెల 24 వరకు నామినేషన్ల స్వీకరణ
- 25న నామినేషన్ల పరిశీలన
- 28వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు
- ఆగస్టు 1న ఎన్నికలు



నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్‌): నగర పాలక సంస్థ స్టాండింగ్‌ కమిటీకి ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పుడున్న స్టాండింగ్‌ కమిటీకి ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. దీంతో నగర పాలక సంస్థ పాలక వర్గానికి సంబంధించి చివరి స్టాండింగ్‌ కమిటీకి ఎన్నికల షెడ్యూల్‌ను గురువారం సాయంత్రం అధికారులు విడుదల చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసే కార్పొరేటర్లు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నామినేషన్లను సమర్పించవచ్చు. ఈ నెల 24వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 25న నామినేషన్ల పరిశీలన, అదే రోజు అభ్యర్థుల జాబితా ప్రచురిస్తారు. ఈ నెల 28వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆగస్టు 1న స్టాండింగ్‌ కమిటీకి ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది. విజయం సాధించిన అభ్యర్థులను అధికారులు ప్రకటిస్తారు. ఈ కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారు. స్టాండింగ్‌ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారు నగరపాలకకు సంబంధించి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు ఆమోదం వ్యక్తం చేయాల్సి ఉంటుంది.

నాలుగు సంవత్సరాలు విజయవంతంగా...

నగరపాలక సంస్థ పాలకవర్గానికి సంబంధించి స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన అభ్యర్థులే గెలుస్తూ వచ్చారు. గతేడాది కొంత పరిణామాలు మారాయి. కొంతమంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. గతేడాది జరిగిన స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల్లో మంత్రి ఆదేశాల మేరకు స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల బరిలో నిలిచారు. మంత్రి ఆయన స్థాయిలో చక్రం తిప్పారు. పావులు కదిపారు. డబ్బు ఎర వేశారు. టీడీపీకి చెందిన 9 మందికి అదనంగా మరో 11 మంది వైసీపీ కార్పొరేటర్లు చేరడంతో గత స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి ఇద్దరు పోటీ పడ్డారు. క్రాస్‌ ఓటింగ్‌తో వైఎస్సార్‌సీపీకి దెబ్బకొట్టాలని అన్ని ప్రయత్నాలు చేసినా తెలుగుదేశం పార్టీకి ఎన్నికల్లో భంగపాటు తప్పలేదు. కార్పొరేషన్‌లో ఒక మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు ఉన్నా టీడీపీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. పోటాపోటీగా ఈ ఎన్నికలు నిర్వహించినా ఐదుగురు అభ్యర్థులు వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీకి చెందిన వారే గెలుపొందారు. తాజాగా మరోసారి నోటిఫికేషన్‌ విడుదల అయ్యింది. ఈ పాలక వర్గానికి ఇవే చివరి స్టాండింగ్‌ కమిటీ ఎన్నికలు. అయినా పట్టుమని 8 నెలల కూడా గడువు ఉండదు. పైగా గెలుస్తామా? అన్న ఆందోళన ఆ పార్టీకి ఉంది. దీంతో తెలుగుదేశం నుంచి పోటీకి దిగే పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు.

క్యాజువాలిటీ డాక్టర్లు నిర్లక్ష్యం వీడాలి

కర్నూలు(హాస్పిటల్‌): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డ్యూటీ డాక్టర్లు నిర్లక్ష్యం వీడాలని ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యుడు పీటీ.సాయిప్రదీప్‌ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 16వ తేదీన కర్నూలు మండలం బి.తాండ్రపాడుకు చెందిన పి.కళ్యాణ్‌ (23) అనే యువకుడిని మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తి యాక్సిడెంట్‌ చేశారని పేర్కొన్నారు. అతన్ని స్నేహితులు రాత్రి 8.36 గంటలకు క్యాజువాలిటీకి తీసుకొచ్చారని, మరుసటి రోజు గురువారం వరకు పోలీస్‌ అవుట్‌ పోస్టుకు ఎంఎల్‌సీ వెళ్లలేదని చెప్పారు. ఇందులో క్యాజువాలిటీ వైద్యుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.

6న సర్వసభ్య సమావేశం

కర్నూలు కల్చరల్‌: టీజీవీ కళాక్షేత్రం సర్వసభ్య సమావేశం ఆగస్టు 6వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. కళాక్షేత్రం శాశ్వత సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కళాక్షేత్రం అభివృద్ధి, కళాకారుల సంక్షేమం గురించి చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు.

స్మార్ట్‌ మీటర్లను తక్షణమే తొలగించాలి



మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్‌): కూటమి ప్రభుత్వం స్మార్ట్‌ మీటర్లను తక్షణమే తొలగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్‌, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌.మునెప్ప డిమాండ్‌ చేశారు. గురువారం కార్మిక కర్షక భవన్‌లో ప్రజా వేదిక ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్‌ రాధాకృష్ణ అధ్యక్షతన రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ఇంధన సర్దుబాటు పేరుతో ట్రూ అప్‌ చార్జీలను వసూలు చేయడం ఆపాలన్నారు. యూనిట్‌ విద్యుత్‌ వినియోగానికి ఆరు పైసల నుంచి రూపాయి వరకు వేసిన సుంకాన్ని ఎత్తివేయాలని డిమాండ్‌ చేశారు. 2024–25 మధ్య వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేసిన రూ.2787 కోట్లు, 2019–25 మధ్య కాలానికి వసూలు చేసిన రూ.1500 కోట్లను ట్రూడౌన్‌ ద్వారా బిల్లులో తగ్గించాలన్నారు. ప్రజలపై కూటమి ప్రభుత్వం వేసిన అదనపు విద్యుత్‌ భారం రూ.15526 కోట్లను రద్దు చేయాలన్నారు. అదానీ కంపెనీతో జరిగిన సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానం మేరకు పెంచిన విద్యుత్‌ చార్జీలను తగ్గించాలని కోరారు. మరోవైపు ప్రమాదకర విద్యుత్‌ సంస్కరణ చట్ట సవరణను రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ 2 కోట్ల మంది విద్యుత్‌ వినియోగదారులకు ప్రజా వేదిక పిలుపునిస్తోందని చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్‌, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బి.గిడ్డయ్య

కర్నూలు(సెంట్రల్‌): ఆగస్టు 9, 10, 11 తేదీల్లో కర్నూలులో నిర్వహించే సీపీఐ 24వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పెద్దఎత్తున జరిగే మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు, సానుభూతి పరులు తరలి రావాలని కోరారు. గురువారం సీఆర్‌ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ దేశ స్వాతంత్య్రం కోసం, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అనేక కుట్రలను ఎదుర్కొని పోరాటాలు చేసిందన్నారు. కర్నూలులో జిల్లాలోనూ సీపీఐ ఎన్నో పోరాటాలు చేసిందని చెప్పారు. జిల్లా మహాసభల్లో భాగంగా మొదటి రోజు వేలాది మందితో ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. మహాసభల విజయవంతానికి పార్టీ శ్రేయోభిలాషులు, పెద్దలు, దాతలు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. నగర సహాయ కార్యదర్శులు మహేష్‌, శ్రీనివాసరావు, జి.చంద్రశేఖర్‌, నాయకులు బీసన్న, నల్లన్న, ఈశ్వర్‌, భద్రకుమార్‌, అన్వర్‌, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, బద్రి, శివ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్‌ దుకాణాల్లో విజిలెన్స్‌ తనిఖీలు

- రికార్డులు సరిగాలేని రూ.9.16 లక్షలు విలువచేసే ఎరువులు సీజ్‌



సి.బెళగల్‌లో కిసాన్‌మాల్‌ ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

సి.బెళగల్‌: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడులలో రికార్డులు సక్రమంగాలేని దాదాపు రూ.9.16 లక్షలు విలువ చేసే ఎరువులను సీజ్‌ చేశారు. గురువారం ఒంగోలు ఏడీఏ రమేష్‌బాబు, వైఎస్సార్‌ జిల్లా విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ వెంకటనారాయణ, మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్‌ సి.బెళగల్‌లోని శివసాయి ఫర్టిలైజర్స్‌, కిసాన్‌మాల్‌, ఓం నాగసాయి ఏజెన్సీస్‌లలో స్థానిక వ్యవసాయ సిబ్బందితో కలిసి ఎరువులు, పురుగు మందుల నిల్వలపై తనిఖీలు నిర్వహించారు. శివసాయి దుకాణంలో రికార్డులు సరిగాలేని రూ.2,09,100 విలువ చేసే ఎరువుల నిల్వలను, కిసాన్‌మాల్‌లో ఈ–పాస్‌ యంత్రం, నిల్వల రికార్డులలో తేడాలు ఉండటంతో రూ.5,22,093 విలువ చేసే ఎరువులను, ఓం శ్రీ నాగసాయి ఏజెన్సీలో నిల్వ తేడాలతో రూ.1,85765 విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏడీఏ రమేష్‌బాబు, మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన, అనుమతులున్న ఎరువులు, పురుగు మందులనే అమ్మాలని, ప్రతి అమ్మకంపై రైతులకు తప్పనిసరిగా రసీద్‌లను అందజేయాలని, అధిక ధరకు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏఓ మల్లేష్‌కుమార్‌ మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు తమ రికార్డులను, నిల్వలను పకడ్బందీగా నిర్వహించుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది వెంట ఉన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు

- 4 రోజుల్లో ట్రేడ్‌ లైసెన్సుల బకాయిలు వసూలు చేయాలి
- నగరపాలక సంస్థ కమిషనర్‌ పి.విశ్వనాథ్‌ ఆదేశం



పారిశుద్ధ్యంపై సూచనలు చేస్తున్న కమిషనర్‌ పి.విశ్వనాథ్‌

కర్నూలు (టౌన్‌): నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్‌ పి.విశ్వనాథ్‌ హెచ్చరించారు. గురువారం నగరంలో మున్సిపల్‌ అధికారులతో కలిసి క్రిష్ణానగర్‌, కల్లూరు, బిర్లా కాంపౌండ్‌, వెంకటరమణ కాలనీలలో కమిషనర్‌ పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్‌ హాలులో మున్సిపల్‌ పారిశుద్ధ్యం, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ.. నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లదే కీలక బాధ్యత అన్నారు. వారం రోజుల వ్యవధిలో పారిశుద్ధ్యాన్ని గాడిలో పెట్టాలన్నారు. వారానికోసారి మురుగు కాల్వలు శుభ్రం చేయాలని, పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్మికులు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. వాణిజ్య దుకాణాల వద్ద చెత్త కుండీలు ఉండేలా చూడాలని కమిషనర్‌ ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్‌ సతీష్‌ రెడ్డి, ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్‌ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో ఆహారం రుచిగా ఉండాలి

నగర పరిధిలో ఉన్న 5 అన్న క్యాంటీన్లలో మూడు పూటలా ఆహారం రుచికరంగా ఉండాలని, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని కమిషనర్‌ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం నగరంలోని కలెక్టరేట్‌ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అక్కడున్న వారితో భోజన నాణ్యతపై కమిషనర్‌ ఆరా తీశారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్న డాక్టర్‌ మహేశ్వర ప్రసాద్‌

కర్నూలు (హాస్పిటల్‌): చిన్న వయసులో వివాహం, గర్భధారణ వల్ల భవిష్యత్తులో పలు ఆరోగ్య సమస్యలు వస్తాయని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్‌ మహేశ్వర ప్రసాద్‌ చెప్పారు. గురువారం స్థానిక స్టాంటన్‌పురంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ మహేశ్వర ప్రసాద్‌ మాట్లాడుతూ.. చిన్న వయసులో గర్భధారణ వల్ల శారీరక, మానసిక సమస్యలతో పాటు పుట్టబోయే పిల్లలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని చెప్పారు. వారు తక్కువ బరువుతో పుట్టడం, పుట్టాక చనిపోవడం లాంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. అంటువ్యాధులు రాకుండా నివారించేందుకు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతి గురువారం పాఠశాలలో అందించే ఐరన్‌ మాత్రలు వేసుకోవాలన్నారు. ఫ్లోరోసిస్‌ కన్సల్టెంట్‌ డాక్టర్‌ సుధాకర్‌, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్‌ మల్లికార్జున, మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నోరు తెరచిన మ్యాన్‌హోల్స్‌



కల్లూరులో తెరచిఉన్న మ్యాన్‌హోల్స్‌

కల్లూరు: కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌ నుంచి క్రిష్ణానగర్‌కు వెళ్లే దారిలో హంద్రీ బ్రిడ్జికి సమీపంలో ప్రధాన రోడ్డుపై రెండు మ్యాన్‌హోల్స్‌ మూతల్లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్డులో నిత్యం వందల వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రి వేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మ్యాన్‌హోల్స్‌ తెరచి ఉండటం వల్ల ద్విచక్ర వాహనదాలు, ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్స్‌పై గ్రిల్‌ లేదా మూతలు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

మురుగు ఇలా.. నడిచేదెలా?



సచివాలయం ఎదురుగా రోడ్డుపై నిల్వవున్న మురుగునీరు

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ సచివాలయం ఎదురుగా, ప్రధాన రహదారిపై మురుగు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారుల అనాలోచితం, ప్రజాప్రతినిధుల బలహీనతల కారణంగా గ్రామంలోని బస్టాండ్‌ నుంచి కర్నూలు వైపు వెళ్లే సీసీ రోడ్డును ఏటవాలుగా నిర్మించడంతో రోడ్డుపైనే మురుగు నిల్వ ఉంటోంది. దీంతో నిత్యం సచివాలయానికి రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక మురుగులో దోమలు వృద్ధి చెంది ప్రజల వ్యాధులకు కారణమవుతున్నాయి. సమీపంలోనే ఓ ప్రైవేట్‌ స్కూల్‌ ఉంది. విద్యార్థులు కూడా రాకపోకలు సాగించే క్రమంలో కాలుజారీ పడిన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పరిష్కారం దిశగా ఆలోచించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చేతులు పండగా..
ఆరోగ్యం మెండుగా..

- ఆషాఢంలో మగువల నేస్తం గోరింటాకు
- అందంతో పాటు ఆరోగ్యం
- ఇన్‌ఫెక్షన్లు దరి చేరవని నమ్మకం
- ఆకట్టుకుంటున్న రకరకాల డిజైన్లు



అరచేతులకు గోరింటాకు పెట్టుకొని చూపుతున్న మహిళలు

కర్నూలు కల్చరల్‌: ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు.. ఆరేళ్ల బాలికల నుంచి అరవయ్యేళ్ల ముత్తయిదువల వరకూ ఒకటే సందడి. గోరింటాకు కోసుకునో, కొనక్కునో తెచ్చుకోవడం.. దానిని ముద్దగా నూరడం.. చేతులకు, కాలి వేళ్లకు, పాదాలపై రకరకాల డిజైన్లలో పెట్టుకోవడం.. అరచేతిలో, అరికాలిలో చందమామలానో, మరేదైనా డిజైన్‌తోనే అద్దుకోవడం. కొంతసేపు ఆరిన తరువాత దానిని తొలగించి శుభ్రంగా కడుక్కుని ఎంత ఎర్రగా పండిందో చూసుకొని మురిసిపోవడం.. వారి మురిపాలు చూసి అన్నదమ్ములు.. నాన్న, బాబాయ్‌లు మామయ్యలు ఇలా పురుషపుంగవులంతా ఆనందించడం.. ఇదంతా ప్రతి ఇంటా కనిపించే గొప్ప ముచ్చట.

సౌభాగ్య చిహ్నంగా..

గోరింటాకును స్త్రీలు సౌభాగ్యానికి చిహ్నంగా భావిస్తారు. గోరింటాకు అంటే ×గోటికి అంటు ఆకు¥ అని అర్థం. దీనిని ×న కరంజనీ¥ అని కూడా అంటారు. అంటే గోళ్లను పండించేది అని అర్థం. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం ఎంతో మంచిదని పెద్దలు చెబుతారు. గోరింటాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచి భర్త వస్తాడని నానుడి ఉంది. ఈ మాసంలో యువతులు కచ్చితంగా గోరింటాకు పెట్టుకోవాలని అంటారు.

గౌరీ ఇంటి ఆకు..

గోరింటాకు ఆవిర్భావం వెనుక చిత్రమైన కథ చెబుతారు. గౌరీ దేవీ రజస్వల అయ్యి ఆమె రక్తపు బొట్టు నేలకు తాకడంతో ఈ మొక్క ఉద్భవించిందంటారు. తండ్రి పర్వత రాజు సతీసమేతంగా వచ్చి చూస్తే ఆ చెట్టు పెద్దదై ఉంటుంది. గౌరీ దేవి ఆ చెట్టు ఆకులు కోస్తే చేతులు ఎర్రగా పండుతాయి. బిడ్డ చేతులు కంది పోయాయని పర్వత రాజు భావించగా, తన చేతులకేమీ కాలేదని, ఎర్రబడి కొత్త అలంకారంతో మరింత అందంగా ఉన్నాయని ఆమె చెబుతుంది. దీంతో సంతోషించిన పర్వతరాజు ఇకపై ఈ మొక్క ఆకు స్త్రీ సౌభాగ్య చిహ్నంగా లోకంలో ప్రసిద్ధి చెందుతుందని చెప్పాడట. అలా గౌరీ దేవి ఇంట ఉద్భవించిన 'గౌరీ ఇంటి ఆకు' క్రమంగా గోరింటాకుగా మారిందంటారు. రజస్వల సమయాన ఉద్భవించిన ఈ చెట్టు స్త్రీల గర్భాశయ సమస్యలను తొలగిస్తుందని చెబుతారు.



గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

మెహందీ రూపంలో కొత్త పుంతలు

ఒకప్పుడు ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు వీలైనంత వరకూ గోరింటాకు తప్పనిసరిగా పెట్టుకునే వారు. గోరింటాకు దొరకని వారికి ఒకింత అసంతృప్తి మిగిలేది. ఇప్పుడా బాధ లేకుండా మెహందీ అందుబాటులోకి వచ్చింది. ఏ ఇంట్లో ఫంక్షన్లు జరిగినా మెహందీకి ప్రత్యేక స్థానం ఉంది. ఇటీవల పెళ్లిళ్లు, పండుగలు ఇతర ఫంక్షన్లలో ఆడవాళ్లంతా సమూహంగా చేరి గోరింటాకు (మెహందీ) పెట్టుకోవడాన్ని పత్యేక వేడుకగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన మహిళలు వివిధ రకాల ఆకర్షణీయమైన డిజైన్లలో కోన్‌లతో మెహందీ పెడుతున్నారు. పెళ్లికూతరి రెండు చేతులకు మెహందీ పెట్టడానికి రూ.1500 నుంచి రూ.2 వేల వరకు తీసుకుంటున్నారు. డిజైన్‌ను బట్టి ధర ఉంటుంది. ఒక్కో మెహందీ వేడుకకు రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు వెచ్చిస్తున్నారంటే ఎంత క్రేజ్‌ ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎన్నో ఉపయోగాలు

- గోరింటాకు ఏడాది పొడవునా పెట్టుకోవచ్చు. అలా చేయడం లేదని కనీసం ఆషాఢ మాసంలోనైనా తప్పనిసరిగా పెట్టుకోవాలని పెద్దలు ప్రోత్సహిస్తున్నారు. ఆషాఢంతో వేసవి ముగిసి వర్ష రుతువు ఆరంభమవుతుంది. తరచూ వానలో తడుస్తుడటం, బురదలో తిరగడం వల్ల ఇన్‌ఫెక్షన్లు, గోళ్లలో మట్టి ఉండిపోవడం, ఒరుపులు, పాచిపోవడం, పిప్పి గోళ్లు, చర్మ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు గోరింటాకు ఉపకరిస్తుందని చెబుతారు. అందుకే పెద్దలు అరికాళ్లకు, పాదాలకు, చేతులకు, గోళ్లకు పూర్తి స్థాయిలో గోరింటాకు పెట్టుకునే వారు.
- గోరింటాకు శరీరంలోని వేడిని తొలగిస్తుంది.
- అరచేతిలో స్త్రీ గర్భాశయానికి సంబంధించిన నాడులుంటాయని, చేతికి గోరింటాకు పెట్టుకోవడం వల్ల అతి ఉష్ణం తగ్గి, మేలు జరుగుతుందని చెబుతారు.
- ఆయుర్వేదం ప్రకారం గోరింటాకులోని రసాయనాలు పుండ్లను మాన్పుతాయి.
- తల నెరిసిన వారు రసాయనాలు కలిపిన హెయిర్‌ డైలు వాడటం వల్ల చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. దీనికి బదులుగా గోరింటాకు పెట్టుకోవడం మంచిదని చెబుతారు.
- కాళ్లు పగలడం సమస్య ఉన్నవారు గోరింటాకు పెట్టుకుంటే మంచి ఫలితాలుంటాయి.

ఎంతో విశిష్టత ఉంది




గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతారు. గోర్లు పుచ్చు పడకుండా గోరింటాకు కాపాడుతుంది. ప్రస్తుతం నలుగురు మహిళలు చేరి సంతోషంగా ఉండాలంటే మెహందీ పెట్టుకోవడమే సరైన మార్గం. పాత కాలం నుంచి గోరింటాకుకు విశిష్టత ఉంది.
– మేడా వైష్ణవి, లలితా పీఠం నిర్వాహకురాలు

గోరింటాకే శ్రేయస్కరం



గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మార్కెట్‌లోకి వచ్చే కోన్‌లలో గోరింటాకుతో పాటు వివిధ రసాయనాలుంటాయి. సహజ సిద్ధంగా లభ్యమయ్యే గోరింటాకు వినియోగించడమే శ్రేయస్కరం. – తెలుగు మహేశ్వరి, కర్నూలు

ఆరోగ్య రీత్యా మేలు



ఔషధ గుణాలున్న గోరింటాకు ఆరోగ్య రీత్యా మేలు చేస్తుంది. చాలా మంది గోరింటాకు అనగానే కేవలం చేతులకు అలంకారంగా పెట్టుకొనే సౌందర్య సాధనంగా మాత్రమే భావిస్తారు. కానీ గోరింటాకు గొప్ప ఔషధం. దీన్ని వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వర్షాకాలంలో చేతులు, కాళ్లకు చర్మ సమస్యలు తలెత్తకుండా ఎంతో ఉపయోగపడుతుంది.
– డాక్టర్‌ కె.రఘురాముడు, ఆయుర్వేద వైద్యులు